నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 27 జూలై 2024 | HYDERABAD

గ్రేటర్‌లో 8 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్

సిటీబ్యూరో,జూలై 26 (నమస్తే తెలంగాణ): నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చర్యలు చేపట్టింది. కొత్తగా ఏర్పాటు చేసిన సెక్షన్ కార్యాలయాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు,అత్యవసర మరమ్మతులు నిర్వహించేలా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తూ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు చేశారు. గ్రేటర్ పరిధిలో ఉన్న 10 సర్కిల్ కార్యాలయాల పరిధిలో ఇప్పటికే 205 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్ (ఎఫ్ఓసీ) ఉండగా, కొత్తగా మరో 8 ఎఫ్ఓసీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్ సేవలందిస్తాయని అధికారులు తెలిపారు.

సర్కిల్	ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్స్
సికింద్రాబాద్	బైబిల్ హౌజ్, పార్సిగుట్ట
హైదరాబాద్ సెంట్రల్	కవాడీగూడ,రాంనగర్, బర్కత్‌పుర, విద్యానగర్
మేడ్చల్	నిజాంపేట
సంగారెడ్డి	అమీన్‌పూర్

పాతబస్తీ లాల్ దర్వాజా బోనాల వేడుకలు

రేపు, ఎల్లుండి ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): సింహ వాహిని మహంకాళి లాల్ దర్వాజ బోనాల పండుగ సందర్భంగా పాత నగరంలోని ఫలక్‌నుమా, చార్మినార్, మీర్‌చౌక్, బహదుర్‌పురా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 28, 29వ తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. పాతబస్తీలో ఆదివారం బోనాలు, సోమవారం ఘటాల ఊరేగింపు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు అదనపు సీపీ వెల్లడించారు. అక్కన్న మాదన్న ఆలయం నుంచి నయాపూల్ వరకు కొనసాగే భారీ ర్యాలీలో ఏనుగుపై ఉరేగింపు ఉంటుందన్నారు. పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను పార్కు చేయాలని సూచించారు.

సింహ వాహిని మహంకాళి లాల్‌దర్వాజ బోనాలను పురస్కరించుకుని భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వంద ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాల్ దర్వాజ ఆలయం, ఎంజీబీఎస్, రేతిఫైల్, జేబీఎస్‌ల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమాచారం కోసం 9959226154, 9959226160 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బల్దియా ఫెయిల్!

సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకం

ఒకవైపు ట్రాఫిక్, మరోవైపు నగరం చెత్తమయం

పెరుగుతున్న డెంగీ, మలేరియా వ్యాధులతో ప్రజల్లో ఆందోళన

శాఖల మధ్య సమన్వయ లోపంపై సీఎం సీరియస్

కమిషనర్ పనితీరుపై అసంతృప్తి?

బాధ్యతలు చేపట్టి నెల రోజులు దాటినా పట్టు సాధించలేకపోతున్న ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో పాలన పట్టుతప్పుతోందా? పారిశుధ్యం నిర్వహణ సరిగా లేక డెంగీ, మలేరియా కేసులు విజృంభిస్తున్నాయా? శాఖల మధ్య సమన్వయం లేక నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదా? గుంతల రోడ్లతో వాహనదారుల నడ్డి విరుగుతుందా? అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదా? ఎన్నో ఆశలతో వచ్చిన అర్జీదారులకు ప్రజావాణిలో పరిష్కారం దొరకడం లేదా? కీలకమైన కమిషనర్ బాధ్యతలు తీసుకున్న ఆమ్రపాలి సమర్థవంతమైన పాలనను నడిపించడంలో ఫెయిల్ అవుతున్నారా? అంటే నగర పౌరుల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఇదే సమయంలో మూడు రోజుల క్రితం నగరంలో ట్రాఫిక్ నరకయాతన, పారిశుధ్య నిర్వహణలో పనితీరు బాగాలేదంటూ కమిషనర్ ఆమ్రపాలిపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. శాఖల మధ్య సమన్వయంతో పరిస్థితులను చక్కదిద్దాలని సూచించినట్లు సమాచారం. మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలులోనూ అలసత్వం ప్రదర్శించవద్దని చెప్పినట్లు వినికిడి. మొత్తంగా జీహెచ్ఎంసీలో సమస్యలపై అటు ప్రజలు, ఇటు నెట్టింట్లో పౌరుల ఫిర్యాదులతో పాలన అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగిన కీలకమైన శాఖలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి సమస్యలపై క్షేత్రస్థాయి తనిఖీలు చేయకపోవడం, గతంలో లేని విధంగా రహదారులపై గుంతలు, అన్ని శాఖలతో సమన్వయ సమావేశాలు, పారిశుధ్యం, ట్రాఫిక్, చివరకు ప్రజావాణి సమస్యలకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారు. వాస్తవానికి గత కమిషనర్ రొనాల్డ్‌రాస్ విదేశీ పర్యటన సమయంలో 15 రోజుల పాటు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలి, గత నెల 24న రొనాల్డ్‌రాస్ ఇంధనశాఖకు బదిలీ కావడంతో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దాదాపు నెలన్నర రోజులు గడిచిన.. ఆమ్రపాలి పట్టు సాధించడంలో విఫలమయ్యారన్న విమర్శలు లేకపోలేదు. ప్రజావాణిలో కమిషనర్ సరిగా సమయం కేటాయించకపోవడం.. ఫిర్యాదు చేసిన అర్జీదారులకు పరిష్కారం దొరుకుతుందన్న భరోసా కల్పించడం లేదు. దాదాపు ప్రజావాణిలో 850కి పైగా ఫిర్యాదులు స్వీకరిస్తే అందులో సగానికి మాత్రమే పరిష్కారం చూపారు. పార్కుల్లో మౌలిక వసతులు లేవని వాకర్లు చెప్పిన వాటిని పరిష్కరించిన దాఖలాలు లేవు. కొత్త ప్రాజెక్టులు, సంస్కరణలపై దృష్టి సారించిన పరిస్థితులు లేవు. ఉన్న వాటితోనే నెట్టుకొస్తున్నారే తప్ప కొత్త ఆలోచనలకు నాంది పడటం లేదు. క్షేత్రస్థాయి పర్యటనలు నామమాత్రంగానే ఉండటంతో ఫీల్డ్‌లో ఉండే అధికారులు, సిబ్బందిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. టెలికాన్ఫరెన్స్‌లకు కమిషనర్ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్యలు యథావిధిగానే ఉన్నాయి. వర్షాలకు ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని చెప్పినా, గుంతలమయంగా నగరం దర్శనమిస్తున్నది. సీఆర్ఎంపీ రోడ్లలోనూ ఏజెన్సీలపై పర్యవేక్షణ, చర్యలు ఉండటం లేదు. నాలా పూడికతీత, మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలుపై పర్యవేక్షణ లేదు. డెంగీ నివారణ విషయంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని, బకాయిలు రూ. 1000కోట్లకు పైగా పేరుకుపోయాయని కాంట్రాక్టర్లు ఆందోళన చేస్తున్నా.. పరిష్కారానికి నోచుకోక వారి సమస్య రోజురోజుకు ముదురుతూనే ఉంది. అయితే అదనపు బాధ్యతలతో కమిషనర్ సతమతమవుతున్నారా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న చర్చ కూడా జరుగుతున్నది.

సమన్వయ సమావేశాలు ఎక్కడ?

హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధికి, పౌరులకు సత్వర సేవలకు సంబంధించి కీలకమైన సమన్వయ సమావేశాలను జీహెచ్ఎంసీ పట్టించుకోవడం లేదు. అంతర్గతంగానూ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయ లేమితో జీహెచ్ఎంసీ వైఖరి నగర పౌరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. ప్రధానంగా అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకాలు ఉత్పన్నమవుతూ సకాలంలో పనులు చేయలేకపోతుండటం, తద్వారా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఫుట్‌పాత్, జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్య మొదలు నాలా, రహదారుల వెడల్పు, భూసేకరణ, అనుమతుల్లో జాప్యం, విద్యుత్, జలమండలికి సంబంధించి ఏ పనులు చేయాలన్నా ఏదో ఒక సమస్య ఏర్పడుతుంది. వాస్తవంగా గతంలో సిటీ సమన్వయ కమిటీ తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టేది. జలమండలి, పోలీస్, విద్యుత్, పీసీబీ, ఆర్టీసీ, వైద్యారోగ్యశాఖ, కలెక్టరేట్, అగ్నిమాపక శాఖ, హెచ్ఎండీఏ, తదితర శాఖల అధికారులు సభ్యులుగా ఉండగా, జీహెచ్ఎంసీ పెద్దన్న పాత్రను పోషించేది. ఈ సిటీ సమన్వయ కమిటీతో నగరంలో ప్రస్తుతం విస్తరించి కనిపిస్తున్న రహదారుల వెడల్పులో భాగంగా స్థల సేకరణకు సంబంధించి అనేక సమస్యలకు పరిష్కారం చూపేవారు. దీర్ఘకాలిక ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధిలో ఇతర శాఖలను భాగస్వామ్యం చేస్తూ ప్రతి నెలలో రెండు సార్లు కన్వర్జెన్సీ సమావేశాలు నిర్వహించేవారు. ఒకానొక దశలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలతో హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టేవారు. కానీ గడిచిన కొన్ని నెలలుగా ప్రభుత్వ శాఖలతో జీహెచ్ఎంసీ సమన్వయం కుదరడం లేదు.

జలమండలి వర్సెస్ జీహెచ్ఎంసీ

అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వేరే పనుల కోసం రోడ్లను తవ్వి అలాగే వదిలి వెళ్తున్నారు. కొన్ని చోట్ల అసలు అనుమతి లేకుండానే పనులు చేస్తున్నారు. అదే సమన్వయ సమావేశాలు నిర్వహిస్తే అన్ని శాఖల అధికారులు ఉండటంతో అనుమతులు ఎవరిచ్చారో తెలుస్తుందని..దీని వల్ల పనులు పూర్తయ్యాక తిరిగి రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. వైట్‌టాపింగ్ రోడ్లు, ఎస్ఆర్‌డీపీ తదితర పనులు ప్రారంభించే ముందుగానే ఆయా మార్గాల సమాచారాన్ని ఎలక్ట్రిసిటీ, జలమండలి, పోలీస్ తదితర శాఖలకు అందిస్తే పైపులైన్లను మార్చడం, అండర్ కేబుల్ నెట్‌వర్క్స్, సీసీ టీవీల ఏర్పాటు తదితర పనులను ముందే పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అలా చేయకపోవడంతో రోడ్లు వేసిన కొద్ది రోజులకే ఏదో కారణంగా తవ్వేస్తున్నారు. దీని వల్ల ప్రజాధనం వృథా కావడంతో పాటు జనం ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి అపరిష్కృత సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలి

కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): లక్ష్యం మేరకు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. శుక్రవారం జోనల్ అదనపు కమిషనర్‌లతో కమిషనర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఆర్ఎంసీ ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించి ఏజెన్సీలతో చేసుకున్న అగ్రిమెంట్ డిసెంబర్ వరకు గడువు ఉన్నదని.. పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ పనులను వెంటనే పూర్తి చేయించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. డెంగీ వ్యాధి నియంత్రణకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. దోమలతో వచ్చే వ్యాధులతో పాటు ఈగల ద్వారా వచ్చే వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై నగర వాసులు దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. కమ్యూనిటీ హాల్స్ వివరాలు సర్కిల్ వారీగా పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

'ఇన్‌స్పైర్ అవార్డ్స్'కు దరఖాస్తులు

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్-2024 నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి కె.రోహిణి తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో గూగుల్ మీట్ నిర్వహించి ఇన్‌స్పైర్ అవార్డ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్ మాట్లాడుతూ.. ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ 2024-25 నామినేషన్స్ సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ప్రతి పాఠశాలలో ఒక బాక్స్ ఏర్పాటు చేసి, సమస్య దాని పరిష్కారంపై వినూత్న ఐడియాలను రాసి ఆ బాక్స్‌లో వేయాలని కోరారు. ప్రతి పాఠశాల నుంచి ఉత్తమ 5 ఆలోచనలను ఎంపిక చేసి వాటిని ఇన్‌స్పైర్ అవార్డ్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రతి పాఠశాల ఇండియన్ పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేయాలని, ప్లేస్టోర్‌లో ఇన్‌స్పైర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కాగా ఈ మీట్‌లో 450 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్‌పై సీనియర్ విద్యార్థుల దాడి

విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 26: మహావీర్ ఇంజినీరింగ్ కళాశాలలో జూనియర్ విద్యార్థిపై దాడి చేసిన ఘటనలో సీనియర్ విద్యార్థులపై మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మహావీర్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఈ నెల 23న కళాశాల ఆడిటోరియంలో సెమినార్ ఉండటంతో తరగతి గదుల్లోకి వెళ్లి.. హాజరు కావాలని చెప్పాడు. దీంతో సీనియర్ విద్యార్థులు.. అంత గట్టిగా ఎందుకు అరుస్తున్నావు.. చిన్నగా చెప్పొచ్చుకదా.. అని సూచించారు. దీంతో జూనియర్ విద్యార్థి, సీనియర్ విద్యార్థుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శుక్రవారం వీరి మధ్య మరోసారి వాగ్వాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం సీనియర్ విద్యార్థులు ఐదుగురు కలిసి జూనియర్ విద్యార్థిని బాత్‌రూమ్ వద్ద పట్టుకొని గొడవకు దిగుతావా.. అంటూ దాడి చేశారు. దీంతో బాధితుడు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీనియర్ విద్యార్థులపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీనియర్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కాన్వాయ్ వచ్చే.. పోలీసులు బెంబేలెత్తే

సిటీబ్యూరో, జూలై 26 (నమస్తే తెలంగాణ): అనుకున్న సమయం కంటే అరగంట ముందు శుక్రవారం మధ్యాహ్నం సీఎం కాన్వాయ్ సచివాలయం వైపు రావడంతో అటూ సామాన్యులు.. ఇటూ పోలీసులు ఇబ్బందులు పడ్డారు. అలాగే సీఎం కాన్వాయ్ ఆ ట్రాఫిక్‌ను ఛేదించుకుంటూ వెళ్లడం మరో ఎత్తు. హైదరాబాద్ పోలీసులు సమన్వయ లోపంతో పనిచేస్తున్నారనేదానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. జుబ్లీహిల్స్ వైపు నుంచి సచివాలయం వైపునకు మధ్యాహ్నం 3.3 గంటలకు సీఎం వస్తున్నాడంటూ అప్పటికే సెట్‌లో పోలీసులకు సమాచారం అందించారు, అయితే ముఖ్యమంత్రి అరగంట ముందే సచివాలయానికి బయలుదేరారు. ఆయా కూడళ్లలోకి సీఎం కాన్వాయ్ రావడంతో కంగుతిన్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు నానా తంటాలు పడ్డారు. సీఎం వచ్చే రూట్‌లో అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసులు మధ్యాహ్నం వేళల్లో నిద్రావస్థలో ఉండటంతో ట్రాఫిక్‌ను సముదాయించలేక ఇబ్బందులు పడ్డారనే విమర్శలు వస్తున్నాయి. సాధారణ ట్రాఫిక్‌ను పక్కకు పంపిస్తూ, సీఎం కాన్వాయ్‌ని మరో పక్కగా వెళ్లనిస్తూ అప్పటికప్పుడు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. అటూ సీఎం సెక్యూరిటీ వింగ్, శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకోకపోవడం, అప్రమత్తంగా లేకపోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ట్రాఫిక్ నరకం | నగరంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. శుక్రవారం హైటెక్ సిటీలో ట్రాఫిక్ జామ్ అవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పురపాలికల్లో బదిలీలు..

సిటీబ్యూరో,జూలై 26(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో మార్పులు జరిగాయి. శుక్రవారం పురపాలికలకు సంబంధించి జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్‌లకు స్థానచలనం కల్పిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీలకు సంబంధించిన సీపీలను ఇతర శాఖలకు బదిలీ చేశారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న సీపీలు బి.ప్రసాదరావు, కె.మల్లిఖార్జున రావులను హెచ్ఎండీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌లుగా నియమించారు. డిప్యూటీ హోదాలో ఉన్న జి.స్వప్నారెడ్డి డీటీ సీపీ, ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. హెచ్ఎంఆర్ఎల్ డిప్యూటీ డైరెక్టర్, ఎస్.రాజశేఖర్‌ను హెచ్ఎండీఏ ప్లానింగ్ అధికారిగా నియమించారు. హెచ్ఎండీఏ పీఓగా ఉన్న బి.ప్రభాకర్ రెడ్డిని హెచ్ఎంఆర్ఎల్‌కు నియమించారు. ఇదే విభాగంలో ప్లానింగ్ ఆఫీసర్‌గా కొనసాగిన ఎల్.రామ్‌రెడ్డిని హైడ్రాకు నియమించారు. ఈవీడీఎం, డిప్యూటీ డైరెక్టర్, కె.శ్రీనివాస్‌ను హెచ్ఎండీఏ, ప్లానింగ్ అధికారిగా నియమించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో డీసీపీగా ఉన్న వై.సుభాష్‌ను హెచ్ఎండీఏ పీఓగా నియమించారు.